# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఆత్మనిర్భర్ భారత్ దిశగా విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలు, ఆవిష్కర్తలుగా ఎదగాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.
- పశ్చిమ బెంగాల్, తమిళనాడులో ఫారం 17ఏ (ఓటర్ల రిజిస్టర్) పరిశీలన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యిందని భారత ఎన్నికల సంఘం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'మన్ కీ బాత్ - మనసులో మాట' 133వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) హెచ్చరికలు, మార్గదర్శకాలను జారీ చేసింది.
- జైపూర్ లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భర్ భారత్ దిశగా విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలు, ఆవిష్కర్తలుగా ఎదగాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. జైపూర్‌లో రాజస్థాన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 35వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.పి. రాధాకృష్ణన్ మాట్లాడుతూ, విద్యార్థులు విమర్శనాత్మకంగా ఆలోచించాలని, నైతికవిలువలకు ప్రాధాన్యమిస్తూ.. జీవితాంతం నేర్చుకోవడాన్ని అలవరచుకోవాలని అన్నారు. దృఢంగా ఉండి వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకోవడంతో పాటు సమాజ శ్రేయస్సు పట్ల నిబద్ధత కలిగి ఉండాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగానూ, నిర్మాణాత్మకంగా ఉపయోగించాలని ఆయన సూచించారు. వికసిత్ భారత్ దార్శనికతలో విద్యార్థులు దేశ నిర్మాతలు కావాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్, తమిళనాడులో ఫారం 17ఏ (ఓటర్ల రిజిస్టర్) పరిశీలన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యిందని భారత ఎన్నికల సంఘం తెలిపింది. పోలింగ్ జరిగిన రోజున నిర్వహించిన అన్ని రికార్డులను పరిశీలిస్తూ, ఎలాంటి అవకతవకలు జరిగాయో గుర్తించడం, అవసరమైతే రీ-పోలింగ్‌కు సిఫార్సు చేయడం లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీఐ పేర్కొంది. ఇందుకోసం ప్రత్యేకంగా సమగ్ర మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశలో పోలింగ్ జరిగిన 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పరిశీలన సాఫీగా సాగినట్లు అధికారులు పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించగా, 600కు పైగా అభ్యర్థులు వారి ప్రతినిధులు హాజరయ్యారని.. మొత్తం 1,478 మంది అభ్యర్థులకు ముందుగానే తేదీ, సమయం, స్థలం గురించి సమాచారం ఇచ్చినట్లు ఈసీఐ వెల్లడించింది. అలాగే తమిళనాడులోనూ ఇదే తరహా

పరిశీలన 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తి చేసినట్లు తెలిపింది. ప్రతి దశలో పారదర్శకతను కాపాడుతూ, ఎన్నికలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు ఈ చర్యలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ చర్యలతో ఎన్నికల వ్యవస్థ మరింత బలపడుతుందని, ఓటర్ల విశ్వాసం పెరుగుతుందని ఈసీఐ ఆశాభావం వ్యక్తం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

సాధారణ పౌరులకు కేవైసీ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఆర్థిక నియంత్రణ సంస్థలు కలిసి పనిచేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విజ్ఞప్తి చేశారు. ముంబైలో ఈరోజు జరిగిన సెబీ 38వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ, ఒక్కసారి కేవైసీ ఇస్తే పలు ఆర్థిక సంస్థల వద్ద వేర్వేరు సమయాలలో పలు అవసరాలకు ఉపయోగపడేలా చూడడం సంబంధిత వర్గాల ఉమ్మడి బాధ్యత అని అన్నారు. సైబర్‌దాడుల పట్ల సెబీ, నియంత్రిత సంస్థలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక మంత్రి సూచిస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్ - మనసులో మాట' 133వ సంచిక కార్యక్రమంలో దేశ ప్రజలతో తన భావాలను పంచుకుంటారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్ మరియు 'News on air' మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే, ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని పరిరక్షించాల్సిన భాధ్యత న్యాయమూర్తిలపై ఉందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. జైపూర్‌లోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో “పదవీ విరమణ తర్వాత న్యాయపీఠం” అనే అంశంపై జరిగిన ఒక సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. మాజీ న్యాయమూర్తుల పాత్రను నొక్కిచెబుతూ, న్యాయ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంలో వారి సహకారం కీలకమని అన్నారు. పౌరులలో న్యాయపరమైన అవగాహన కల్పించడమే కాకుండా, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు రాజీ, మధ్యవర్తిత్వంలో ముఖ్యమైన పాత్ర పోషించగలరని ఆయన పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ, దాని అనుబంధ సంస్థలైన జాతీయ న్యాయ సేవల అథారిటీ, రాష్ట్ర న్యాయ సేవల అథారిటీలు మరింత చురుకుగా, అవగాహనతో పనిచేయాలని ఆయన పిలుపునిస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) హెచ్చరికలు, మార్గదర్శకాలను జారీ చేసింది. వాయువ్య, మధ్య, ద్వీపకల్ప భారతదేశం అంతటా గరిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ నుండి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయని పేర్కొంది. అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువగా నమోదవుతున్నాయని, ఇది దేశంలోని కొన్ని ప్రాంతాలలో వడగాల్పుల పరిస్థితులను సూచిస్తోందని పేర్కొంది. తీవ్ర ఉష్ణోగ్రతల వలన వచ్చే అనారోగ్యాలను తగ్గించడంలో ముందస్తు అవగాహన, నివారణ చర్యలు కీలకమని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఇందులో భాగంగా శరీరానికి తగినంత నీరు అందించడం, తీవ్రమైన ఎండ వేళల్లో నేరుగా సూర్యరశ్మికి గురికాకుండా ఉండటం, తేలికపాటి దుస్తులు ధరించడం, పిల్లలు, వృద్ధులు, బహిరంగ ప్రదేశాలలో పనిచేసే కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపింది. ఈ నెల 27వ తేదీ వరకు వాయువ్య భారతదేశంలో గరిష్ట ఉష్ణోగ్రతలలో గణనీయమైన మార్పు ఉండదని ఐఎమ్‌డి అంచనా వేసింది. రాబోయే 7 రోజుల వరకు ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, విదర్భలోని పలు ప్రాంతాలలో వడగాల్పుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని ఐఎమ్‌డి సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = =

జైపూర్ లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన రాజస్థాన్ జట్టు 11.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 132 పరుగులు చేసింది.
అంతకుముందు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా.. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుపై పంజాబ్ కింగ్స్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఈరోజు యూఎస్ పసిఫిక్ ఎయిర్ ఫోర్సెస్ కమాండర్ జనరల్ కెవిన్ బిష్నెడర్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భారత్, అమెరికాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక సమన్వయాన్ని ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =